# 15

# 'అమ్మ' లు

"ఏవండీ! తొమ్మిదింటికల్లా అమ్మలు విమానం దిగుతుంది. అప్పుడే ఆరున్నరైంది. మీరు తొందరగా తయారవ్వండి" అంటూ భర్తకు మేలుకొలుపు పాడింది సావిత్రి.

"అబ్బా సావిత్రీ! పావని వచ్చేలోపు విమానాశ్రయంలో వుంటాను. అమ్మల్ని దగ్గరుండి ఇంటికి తీసుకువస్తాను. నువ్వు కంగారు పడకుండా విశ్రాంతిగా వుండు. కూతురూ, మనవడూ వస్తున్నారని నీకు నిద్రకూడా పట్టినట్టు లేదు" నచ్చజెపుతున్నట్టుగా అన్నాడు పద్మనాభరావు. అల్లుడు స్నానానికి వెళ్ళగానే గదిలోకి వచ్చింది సావిత్రి తల్లి లలితమ్మ. "సావిత్రీ! ముఖం కడుక్కున్నావామ్మా? ఇదిగో కాఫీ తాగేసి అలా దిండుమీద వాలి కూర్చో. అన్ని పనులూ సమయానికి జరుగుతాయి. నువ్వు హైరానా పడకు" అన్నదావిడ కూతురికి కాఫీ అందిస్తూ.

పిల్లవాడితో ఒంటరిగా ప్రయాణం చేసి వస్తోంది. ఏం అవస్థపడిందో ఏమో.... అప్పుడే సంవత్సరమయింది అమ్మల్ని చూసి...." అంటున్న సావిత్రి కళ్ళు చెమర్చాయి.

"నిన్ను చూడాలనే కదా ఆస్ట్రేలియా నుండి పరుగెత్తుకు వస్తోంది. కూతుర్ని, మనవడిని చూస్తే నీకు కావల్సినంత బలం వస్తుందిలే" లలితమ్మ కూతురి తల నిమిరి ప్రేమగా అన్నది.

"అమ్మా! వంటావిడకు చెప్పు ఉదయం ఫలహారానికి పెసరట్టు వేయమని. అమ్మలుకు చాలా ఇష్టం. అలాగే భోజనంలోకి మునక్కాయల పులుసు, బెండకాయల వేపుడు చేయమను. ఆ బుజ్జి తండ్రి ఇవన్నీ తినడేమో... వాడికి నూడుల్స్ లేక పాస్టాలాంటిది పెడుతుందేమో..." అంటున్న సావిత్రికి మనవడు చిరునవ్వు తొంగిచూసింది.

"అలాగే చెప్తాలేగానీ వాళ్ళు ఇంటికి వచ్చేసరికి పదకొండు కావొచ్చు. అంతదాకా నువ్వు తినకుండా కనిపెట్టుకు కూర్చుంటానంటే నేను ఒప్పుకోను. తొమ్మిదింటికల్లా నీకు టిఫిన్ పెట్టేస్తాను" అంది ఖాళీ గ్లాసు తీసుకుని వంటింట్లోకి వెడుతూ.

"అమ్మా ! నువ్వు కాఫీ తాగావా ?" అప్పుడు గుర్తొచ్చి అడిగింది సావిత్రి.

లలితమ్మ నవ్వింది. "స్నానం చేసి తాగుతాలే"

వారం రోజుల నుండి తను వాడుకుంటున్న రెండో పడకగదిలోని తన సామాను పనిపిల్ల జుబేదాతో స్టోరు రూములోకి మార్పించింది లలితమ్మ. ఎనిమిదడుగుల చిన్నగదే అయినా సామాన్లు అన్నీ గూళ్ళలో సర్దడం వలన ఖాళీగానే వుంది బయటి తోటలోకి తెరచుకునే కిటికీ వుండడం వలన గాలి, వెలుతురు బాగానే వున్నాయి. ఎక్స్ట్రాగా వున్న పరుపు తెప్పించి అక్కడ నేలమీద వేయించింది.

డెబ్బై ఏళ్ళ వయసులో తల్లి కిందపడుకోవలసి రావడం సావిత్రి మనసుకు కష్టంగా అనిపించింది. చిన్నపిల్లవాడితో వస్తున్న కూతురు పావనికి డబుల్ కాట్, పరుపు తప్పనిసరిగా కావాలి గనుక తల్లి స్టోర్ రూములోకి మారడం చూస్తూ వూరుకుంది.

మనవరాలికి గది సిద్ధం చేసిన తర్వాత సావిత్రికి టిఫిన్ తీసుకువచ్చింది లలితమ్మ.

"నువ్వెందుకమ్మా ఇన్నిసార్లు అటూ ఇటూ తిరుగుతావు? గౌరమ్మ తెచ్చిపెడుతుందిలే నాకు" అంటూ నొచ్చుకుంది సావిత్రి.

"నేనుండే నెలరోజులు నాచేత్తో నీకు పెట్టనివ్వవే పెసరట్లు బాగా వచ్చాయేమో చూడు... నీకు నచ్చితే నీ కూతురికీ నచ్చుతాయి" అంటూ ప్లేటు అందించింది లలితమ్మ.

"నోట్లో ఏదో రాగి, ఇత్తడిలాంటివి కరిగించి పోసినట్టు వికారంగా వుంటుంది.... నాకు రుచులు ఏం తెలుస్తాయి? తిన్నది బయటకు రాకపోతే చాలు" చిన్నగా నవ్వి అంది సావిత్రి.

లలితమ్మకు గుండెలో బాధ సుళ్ళు తిరిగింది. ఏడాది కిందటి దాకా ఒత్తుగా పొడవుగా వుంటే తలకట్టుతో, యాభై ఏళ్ళ వయసును దాచేసే బుగ్గల నిగారింపుతో, కళగా మెరిసే కళ్ళతో వుండే సావిత్రి ఎలా అయిపోయింది? కోడి పీకినట్టున్న జుత్తు, ఎండిపోయిన చెంపలు, లోతుకు పోయిన కళ్ళు .... బలవంతంగా నవ్వుతున్న సావిత్రిని చూస్తుంటే ఆవిడకు దుఃఖం పొంగుకు వచ్చింది.

"అలాగంటే ఎలాగమ్మా? కాస్త తినకపోతే మరీ నీరసించిపోతావు" తన కళ్ళలో నీరు కూతురికి కనబడకుండా వెనక్కి తిరిగింది లలితమ్మ.

ఏదో తిన్నానన్న వాస్త్రం చేసి పక్కకు పెట్టేసింది సావిత్రి. "వీళ్ళింకా రాలేదేమిటమ్మా? ఎప్పుడనగా తిన్నారో. ఆ విమానంలో ఇచ్చే తిండి మనకు సహించదు. వెజిటేరియన్ అనగానే నాలుగు కూరగాయముక్కలు, రెండు పళ్ళముక్కలు, గట్టిగా వుంటే ఒక బన్ను పెడతారు. ఆ సెల్ ఇలా ఇవ్వమ్మా! ఈయనకు ఫోను చేసి బైల్దేరారో లేదో కనుక్కుంటాను" అంటూ మరో అరగంటలో తల్లిని పిలిచింది.

ఆవిడ ఫోనులో మాట్లాడిన కాసేపట్లో వీధిలో కారు ఆగిన చప్పుడయింది.

ఇక ఆగలేనట్టు లేచి గుమ్మం దగ్గరకు నడిచింది సావిత్రి. తన భుజం మీద నిద్రపోతున్న పిల్లవాడిని కదిలించకుండా జాగ్రత్తగా కారు దిగింది పావని.

"పసివాడితో ప్రయాణంలో ఏం తంటాలు పడ్డావో... ఇంకా నిద్రపోతున్నాడా వీడు? నాన్నగారి కివ్వలేకపోయావా ఎత్తుకునేవారు! ఎంతసేపలా భుజం మీద మోస్తావు? చెయ్యి నొప్పి పుడుతుంది" తనివితీరా కూతుర్ని, మనవడిని చూస్తూ పలకరించింది సావిత్రి.

"దారి పొడుగునా అనిల్‌కి వాంతులయ్యాయమ్మా. భయపడిపోయాను తెలుసా... ఏమీ తినడు, తాగడు నీరసంతో సోలిపోతున్నాడు... వీడు కోలుకుని మళ్ళీ మామూలుగా కావడానికి ఎన్నాళ్ళు పడుతుందో..." అంటూ లోపలికి వచ్చిన పావని కొడుకుని జాగ్రత్తగా తీసుకెళ్ళి గదిలో పరుపు మీద పడుకోబెట్టి హాల్లోకి వచ్చింది.

కూతురి రూపాన్ని కళ్ళనిండా నింపుకోవడానికా అన్నట్టు పావనివైపే చూస్తూ తలుపు పట్టుకుని నిలబడింది సావిత్రి.

ఈలోపుగా గౌరమ్మతో వాళ్ళకి కాఫీ కలపమని చెప్పి, అల్లుడికీ, మనవరాలికీ మంచినీళ్ళు తీసుకు వచ్చి సావిత్రికీ, పావనికీ, అల్లుడికీ అందించి " నువ్వెందుకే నిలబడి వున్నావు? ఇలా కూర్చో..." అంటూ ఫ్యాన్ వేసింది లలితమ్మ.

పావని వచ్చి తల్లిపక్కన కూర్చుని, "ఎలా వున్నావమ్మా?" అంది అప్యాయంగా.

"నాకేమే ? బాగున్నాను. నువ్వే తిండీ, నిద్రలేని ప్రయాణంతో నీరసంగా కనబడుతున్నావు. అనిల్‌కి బాగాలేదంటే ముందు నువ్వు జబ్బుపడినట్లుగా వున్నావు" అంది సావిత్రి కూతురి తల నిమురుతూ.

"బాగున్నావా అమ్మమ్మా? నీ ఆరోగ్యం ఎలా వుంది? కీళ్ళనొప్పులెలా వున్నాయి?" తల్లిదగ్గరి నుండి లేచి వచ్చి అమ్మమ్మ లలితమ్మ చేతులు పట్టుకుని అడిగింది పావని.

"నాకేం అమ్మలూ? గుండ్రాయిలా వున్నాను. కాళ్ళు వున్నంతవరకు కీళ్ళనొప్పులు వుంటాయి వాటి దారిన అవి వుండనీ .... దేవుడు నాకిచ్చిన ఆరోగ్యాన్ని మీ అమ్మ కిస్తే బాగుండేది" అంటున్న లలితమ్మ కళ్ళలో నీళ్ళు నిండాయి.

"నీ మాటలతో దాన్నెందుకమ్మా కంగారు పెడతావ్? పావనీ! నువ్వెళ్ళి స్నానం చేసిరా తల్లీ ! నీ కిష్టమని పెసరట్లు చేయించాను. ఎప్పుడనగా తిన్నావో... ముఖం వాడిపోయింది" అంది సావిత్రి.

"నేను రెండు రోజులు పస్తులున్నా ఫరవాలేదమ్మా! కానీ అనిల్ తిన్నది కాస్తా కక్కేస్తుండటంతో భయపడిపోయాను. ముందు వాడికి ఏదైనా తినిపించి తరువాత నా సంగతి..." అంటూ కొడుకు దగ్గరకు వెళ్ళింది పావని.

సాయంత్రానికల్లా అనిల్ హుషారుగా ఆడుకోవడం మొదలు పెట్టాడు. పావని మనసు కుదుట పడింది. ముఖం తేటపడింది. ఆస్ట్రేలియా నుండి అమ్మకూ, నాన్నకూ తను తెచ్చిన వస్తువులన్నీ వరుసగా బయటపెట్టింది. కాఫీ మేకర్, చిన్న వ్యాక్యూమ్ క్లీనర్, ఎలక్ట్రిక్ షేవరు లాంటివి తెచ్చింది. అమ్మమ్మకు ఊలు స్వెటర్ ఇచ్చింది.

" ఎందుకే అమ్మలూ ఇంత ఖర్చుపెట్టావు?"

"అవేం ఖరీదు కాదమ్మా...." అంటూ తల్లికి మంచి 'స్ప్రే' సీసా ఇచ్చింది.

రెండ్రోజులయ్యాక వరంగల్‌లో వున్న వాళ్ళ అత్తవారింటికి వెళ్ళి వచ్చింది పావని. బెంగుళూరులో పనిచేస్తున్న పావని అన్న భార్యాబిడ్డలతో సహా వచ్చి రెండు రోజులుండి వెళ్ళాడు. కొడుకు ప్రసాద్, కూతురు పావని కళ్ళముందు కనబడుతుంటే సావిత్రి ముఖంలోకి కళ వచ్చింది.

"అమ్మలూ! నెల్లాళ్ళు వుంటావు కదే" అన్నాడు ప్రసాద్ వెళ్ళేముందు.

"లేదన్నయ్యా! రెండు వారాలు సెలవు దొరకడమే కష్టమయ్యింది. ఉద్యోగంలో చేరి ఏడాదే కదన్నయ్యా అయింది" అంది పావని.

"ఐతే నువ్వు ఇరవై ఐదో తారీఖు లోపలే వెళ్ళిపోతావన్న మాట" అంటూ తల్లివైపు చూశాడు ప్రసాద్.

సావిత్రి కళ్ళతోనే కొడుక్కి ఏదో సందేశం అందించింది. "ఎందుకన్నయ్యా అలా అడిగావు?" అన్న పావని ప్రశ్నకు "ఆ... నేను ఆ మధ్యలో వద్దామనుకున్నానులే... సరే నువ్వు వెడతానంటున్నావు గనుక ముందే వస్తానులే..." అనేశాడు.

ఆ రోజు రాత్రి తండ్రి నడిగింది పావని " డాక్టర్లు ఏవంటున్నారు నాన్నా అమ్మ ఆరోగ్యం గురించి?"

"మూడు సార్లు 'కీమో' థెరఫీ ఇచ్చారు కదమ్మా... బాగా నీరసపడింది... కాస్త కోలుకున్నాక ఆపరేషన్ చేస్తార్ట. ఈ ఇరవై అయిదుకు అనుకున్నారు మరి.... నువ్వు వుంటావనుకుంటూ వున్నాను. అసలు మీ అమ్మ ఆపరేషను గురించి నీకు చెప్పవద్దన్నది" అన్నాడాయన బేలగా.

"ఈ విషయం నాకు ముందే చెప్పివుంటే ఇంకో పదిహేను రోజుల తర్వాత వచ్చేదాన్ని కదనాన్నా.... ఇప్పుడెలా? నేను చేస్తున్న ప్రాజెక్టు ఈ నెలాఖరికి ముగించాలి. సెలవు పొడిగించడానికి వీల్లేదు నాన్నా!" అంది పావని బాధగా.

"పోనీలేమ్మా ఎవరు దగ్గరవున్నా చేసేదేముంది? వైద్యం చేసేది డాక్టర్లు బాధ అనుభవించేది మీ అమ్మ దాని బాధను మనం తీసుకోలేముకదా!" వైరాగ్యం తొంగి చూసింది పద్మనాభరావు మాటల్లో.

తరువాతి వారం రోజులు హడావుడిగా గడిచాయి పావనికి. తనని చూడడానికి వచ్చేవాళ్ళు తనని భోజనాలకి పిలిచేవాళ్ళు, కావల్సిన వస్తువు కోసం షాపింగ్, అనిల్ మొండితనం, ముద్దుచేష్టలతో, రెండ్రోజుల్లో ప్రయాణం అనగా తల్లి దగ్గరగా వచ్చి దిగులుగా కూర్చుంది పావని.

"అమ్మా ! నువ్వు ధైర్యంగా వుండు. నీకేమీ కాదు. నేను మళ్ళీ తొందరలోనే వస్తాను" అంటూ అమ్మ తలని ఒళ్ళో పెట్టుకుని ప్రేమగా చెప్పింది.

సావిత్రి నవ్వింది " నా గురించి నాకు బెంగలేదు. నువ్వు మళ్ళీ చిన్నపిల్లాడితో ప్రయాణంలో ఏం ఇబ్బంది పడతావో అనేదే నా చింత" షని.

"నాకైతే వెళ్ళాలని లేదమ్మా... కానీ సెలవు ఇవ్వరు" అంది బేలగా.

ఇంతలో అనిల్ కిందపడి ఏడవడంతో ఒక్క ఉదుటున పరిగెత్తింది.

ఆ రాత్రి వున్నదున్నట్టుగా అనిల్‌కి బాగా జ్వరం వచ్చింది. పావని

భయపడిపోయింది.

తెల్లవారేదాకా కంటిమీద కునుకులేకుండా మేలుకుని కూర్చుంది. ఆరుగంటలకే తండ్రితో కలిసి డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళింది అనిల్‌ని. ఇంజక్షన్ ఇచ్చి, సిరప్ రాసిచ్చి, కొన్ని పరీక్షలు చేయించమన్నాడాయన. వైరల్ ఫీవర్ కావొచ్చుననీ, వారం దాకా ప్రయాణం మాట తలపెట్టవద్దనీ అన్నాడు.

ఇంటికి వచ్చేదాకా నిగ్రహించుకున్న పావని "ఇదేమిటమ్మా ఇలాగైంది?" అంటూ ఏడ్చేసింది.

"ఊరుకో అమ్మలూ! అశుభంగా అలా ఏడవకు. తగ్గిపోతుందిలే. సెలవు కూడా దొరకదు అన్నావు... వాడితో ప్రయాణం ఎలాగే..." అంటూ సావిత్రి దిగులుపడింది. "వాడికి తగ్గేదాకా కదిలేది లేదమ్మా... టికెట్ పోస్ట్‌పోన్ చేయించుకుంటాను. పోనీ వెధవ ఉద్యోగం... అంతగా అయితే పోతుంది అంతేగా... వాడికన్నా నాకు ఏదీ ఎక్కువ కాదు కదమ్మా..." అంది కళ్ళనీళ్ళతో పావని.

"బాగా ఆటలాడి అలసటకు వచ్చిన జ్వరమే అదీ... రేపటికల్లా తగ్గిపోతుంది చూడు" అంటూ ధైర్యం చెప్పింది లలితమ్మ.

ఆ రాత్రికి అనిల్‌కి జ్వరం కాస్త తగ్గింది. అయినా కొడుకు పక్కనే మేలుకుని కూర్చుంది పావని. ఆ రాత్రి పడుకునే ముందు గోడకున్న వెంకటేశ్వరస్వామి పటానికి దండం పెట్టుకుంది లలితమ్మ.

"స్వామీ నా అయుష్షు కూడా నా బిడ్డకు పోసి బ్రతికించు... ఆపరేషను జయప్రదంగా జరిగి అది పది కాలాలాపాటు చల్లగా వుండేలా చూడు" అని.

ఆ రాత్రి సావిత్రికి నిద్ర పట్టలేదు. మనసులో దేవుడిని వేడుకుంటూనే వుంది – 'భగవంతుడా! మా అమ్మలు తన కొడుకుతో క్షేమంగా భర్త దగ్గరికి చేరేట్టు చూడు స్వామీ !' అని

• *స్వాతి మాస పత్రిక - మార్చి 2007* •